ప్రజాశక్తి
ఆదివారం 14 జులై 2024

హిందూపురం పురపాలక సంఘ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. 2019 ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వందల కోట్లతో పట్టణ అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఇతర పనులను ప్రారంభించారు. దీంతో పాటు పలు పనుల కోసం డిపిఆర్‌లను సిద్ధం చేయించి అనుమతుల కోసం ప్రభుత్వనికి ఆ సమయంలో పంపారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధికారం కోల్పోవడంతో అప్పట్లో ప్రారంభించిన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అభివృద్ధి పనుల కోసం పంపిన డిపిఆర్ సైతం కనుమరుగైంది. దీంతో పట్టణ అభివృద్ధి గత 5 సంవత్సరాల నుంచి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాడం, హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం సాధించడంతో 'పురం' అభివృద్ధిపై పట్టణ వాసులు ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నారు.

వైసిపిలో మార్పులు ?

◆ అధ్యక్షుడి మార్పునకు అభిప్రాయ సేకకరణ ◆ 'అనంత' వైపు మొగ్గుచూపుతున్న అధిష్టానం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజాయాన్ని చవిచూసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే స్థానాన్ని దక్కించుకోలేకపోయింది. 2014లో ఓటమి చెందినా కనీసం రెండు అసెంబ్లీ స్థానాల్లోనైనా వైసిపి గెలుపొందింది. ఆ తరువాత 2019 సార్వత్రిక ఎన్నికల్లో 12 అసెంబ్లీతోపాటు, రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. అందులో అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, ఒక్క పార్లమెంటు స్థానం ఉండగా వీటన్నింటినీలోనూ వైసిపి అభ్యర్థులు ఓడిపోయారు. ఈ ఓటమితో వైసిపి శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. సంక్షేమ ఫలాలు తమను గెలిపిస్తాయని భావించిన వైసిపికి తీరని నిరాశనే మిగిలింది. ఈ ఫలితాల నైరాశ్యం నుంచి తిరిగి పార్టీ శ్రేణులను పునరుత్తేజం చేయాలంటే పార్టీలో సంస్థాగతమైన మార్పులు కొన్ని చేపట్టే యోచనలో ఆ అధిష్టానం కనిపిస్తోంది. ఇందులో భాగంగా మొదట జిల్లా అధ్యక్షుల మార్పులు చేపట్టే ఆలోచనలోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఎవరైతే బాగుంటుందన్న అభిప్రాయ సేకరణ కూడా ముఖ్య నేతల నుంచి జరుగుతున్నట్టు సమాచారం. ఈ మేరకు పార్టీ బాధ్యులు ఒకరు ముఖ్య నేతలతో ఫోనులో సంప్రదించినట్టు తెలుస్తోంది. అనంతపురం జిల్లా వరకు చూస్తే ప్రస్తుతం బిసి నాయకులు పైలా నరసింహయ్య అధ్యక్షులుగా ఉన్నారు. ఆయన్ను ఎన్నికలకు ముందు నియమించారు. ఆయన పాత్ర పార్టీ వ్యవహారాల్లో నామమాత్రంగానే సాగిందన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది. ఎందుకంటే ఇక్కడ పూర్తిగా వ్యవహారాలు చక్కబెట్టింది అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఆయన సూచనలకు అనుగుణంగా ఇక్కడ కార్యకలాపాలు సాగాయి. అభ్యర్థుల ఎంపికలు మొదలుకుని అన్నీ ఆయన కనుసన్నల్లోనే నడిచాయి. ఇప్పుడు పార్టీ ఓటమి చెందిన నేపథ్యంలో అధ్యక్షులుగా మరింతగా అందరినీ కలుపుకుని పనిచేయాల్సి ఉంటుంది. అందులోనూ రాజకీయపరమైన అనుభవం పూర్తి స్థాయిలో ఉన్నవారైతే ప్రజాసమస్యలపై అధికారపార్టీని ఎదుర్కొనేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులైన మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి పేరును పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో సీనియర్ నాయకుల్లో ఆయనొకరు. అంతేకాకుండా జిల్లా సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తికావడమే కాకుండా గతంలో పలుమార్లు ఎంపీగానూ పనిచేయడంతో జిల్లా అంతటా పార్టీ శ్రేణులతోనూ సత్ససం బంధాలు చాలా వరకున్నాయి. ఒకరిద్దరు నేతలతో కొంత సమస్యలున్నా, మెజార్టీగా ఆయనకు మద్దతు తెలిపే అవకాశాలు కనిపిస్తుండటంతో జిల్లా అధ్యక్షుడిగా ఆయన్నే నియమించే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. జిల్లా అధ్యక్షుని మార్పుతో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జీలను కొన్నింటిలో మార్పులు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలో ఇటువంటి మార్పులను వైసిపి చేపట్టింది. ఇదే రకమైన మార్పులు జిల్లాలోనూ జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎక్కడెక్కడ మార్పులు జరగనున్నాయన్నది చూడాల్సి ఉంది.

బాలయ్యా... అభివృద్ధి చేయాలయ్యా..!

◆ ఆగిన అభివృద్ధి పట్టాలెక్కేనా..?

◆ 'పురం'లో అపరిష్కృతంగా సమస్యలు

◆ టిడిపి హయాంలో పలు పనులు ప్రారంభం

◆ ఎమ్మెల్యే బాలకృష్ణపై ప్రజల ఆశలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రజలను దశాబ్దాలుగా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. నందమూరి బాలకృష్ణ 2014లో హిందూపురం నుంచి మొదటిసారి పోటీ చేసిన తర్వాత ఈ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించారు. అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. అందులో 2014-2019 మధ్యకాలంలో కొన్ని పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని అర్ధాంతరంగా ఆగాయి. ఇందులో పట్టణంలోని అంతర్గత రహదారుల అభివద్ధి, మురుగు కాలువల నిర్మాణం, ఇతర పనుల కోసం 2018లో రూ.66కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాసవి ధర్మశాల రోడ్డును ప్రారంభించి పూర్తి చేశారు. పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు అనేక కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు పట్టణ అభివద్ధిలో భాగంగా రూ.100 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మించాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చూసేందుకు, రాకపోకలను మెరుగుపరిచేందుకు రింగు రోడ్డు అత్యవసరమని గత టిడిపి ప్రభుత్వ హయాంలో నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. క్రీడాభివద్ధిలో భాగంగా ఎంజీఎం మైదానంలో ఇండోర్ స్టేడియం పనులను రూ. 2 కోట్లతో ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం గోడలు గత ఐదు సంవత్సరాల నుంచి దిష్టిబొమ్మల్లా మైదానంలో దర్శనమిస్తున్నాయి. పేదలందరికీ పక్క గహాలు నిర్మాణం చేసి ఇవ్వాలని సంకల్పించి 10 వేల మందిని ఎంపిక చేశారు. ఇందులో తొలత 2వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి టిడ్కో గహాల పనులను ప్రారంభించారు. ఈ గహాల నిర్మాణ పనులూ అసంపూర్తిగానే ఆగాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడానికి నూతన ఉద్యానవనాలు నిర్మించడం, పాత వాటిలో సౌకర్యాలు కల్పించడం, సూరప్పకుంట చెరువు కట్టలను హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహా అభివద్ధి చేయాలని పనులను చేపట్టారు. వీటితో పాటు 2014-19 కాలంలో పలు అభివృద్ధి పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను ఎక్కడికక్కడ ఆపేయాలని అధికారులకు సూచించించడంతో ఆ పనులన్నీ ఆగిపోయాయి.

ఎంజిఎం మైదానంలో దిష్టిబొమ్మలా ఉన్న ఇండోర్ స్టేడియం

బెంగళూరు రోడ్డు అభివద్ధి పనుల కోసం గత దశాబ్ద కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. బాలకష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని, పట్టణం నుంచి తూముకుంట పారిశ్రామిక వాడ, బెంగళూరు వరకు నాలుగు వరుసల రహదారి చేయాల్సి ఉందని అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు. పట్టణంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ సమయంలో బాలకష్ణ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాటిని ఆమోదించాలంటే పట్టణంలోని ప్రతి మనిషికి కనీసం 135 లీటర్ల నీటిని సరఫరా చేయాలని, అప్పట్లో అంత నీరు సరఫరా చేయకపోవడంతో భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణ ప్రణాళిక పట్టాలు ఎక్కలేక పోయింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీటిని అందించే అవకాశం ఉంది. దీంతో సమగ్ర నీటి వ్యవస్థ ఏర్పాటుతోనే పరిశుభ్రమైన పట్టణం సాధ్యమవుతుంది. ఇక ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న నీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బాలకష్ణ చొరవ చూపి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం పట్టణానికి సంవత్సరానికి 0.3 టీఎంసీల నీటిని శాశ్వత కేటాయింపు చేయించారు. ఇందుకోసం రూ.194 కోట్లతో పనులను చకచకా పూర్తి చేశారు. నీటిని పట్టణ సమీపంలోని కొట్నూరు సంపు వరకు తీసుకొచ్చారు. దీంతో పట్టణానికి రోజుకు 30 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేసేందుకు అవకాశం వచ్చింది. సరఫరాకు అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్ లైన్ లేకపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నారు. దీనికోసం రూ.75 కోట్లతో పట్టణ అంతర్గత పైప్ లైన్ పనులు చేపట్టారు. ఈ పనులు కొంత మాత్రమే జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను రద్దు చేయడంతో పట్టణ వాసులకు అవసరమైన నీరు అందుబాటులో ఉన్నా ప్రజలకు అందించలేని పరిస్థితి నెలకొంది. ఇలా వందల కోట్లతో 2014-19 మధ్యకాలంలో చేపట్టిన అభివద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడం, కేంద్ర సహాయం సైతం ఉండడంతో అభివృద్ధి పనులపై మళ్లీ ఆశలు చిగురించాయి. 2014-19 మధ్యకాలంలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన పనులను ఎమ్మెల్యే బాలకష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తీసుకుని వస్తే హిందూపురం పట్టణంతో పాటు నియోజకవర్గం అన్ని విధాలా అభివద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన 'పురం' అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆగిపోయిన రోడ్డు అభివృద్ధి పనులు

నిలిపోయిన టిడ్కో గృహ నిర్మాణాలు

ఉమ్మడి జిల్లాకు కొత్త ఎస్పీలు

అనంతపురం ఎస్పీ కెవి.మురళీకృష్ణ

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న

అనంతకు కెవి.మురళీకృష్ణ.. శ్రీసత్యసాయికి వి.రత్న

ప్రజాశక్తి -అనంతపురం క్రైం, పుట్టపర్తి రూరల్

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు బదిలీలు అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ఐపిఎస్‌ల బదిలీల్లో భాగంగా ఈ రెండు జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యి వారి స్థానంలో కొత్త వారు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా ఎస్పీ గా కెవి.మురళీ కష్ణ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న గౌతమి సాలిని ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌కు డీసీపీగా నియమించారు. ఆమె స్థానంలో అనకాపల్లి ఎస్పీగా పని చేస్తున్న కెవి.మురళీకృష్ణ అనంతపురం జిల్లాకు వచ్చారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి వి.రత్న నిమమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌వి.మాధవరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో మంగళగిరి 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న రత్న ఎస్పీగా సత్యసాయి జిల్లాకు వచ్చారు.

స్టేడియంను శుభ్రపరుస్తున్న సేవాదళ్ సభ్యులు

పుట్టపర్తిలో సత్యసాయి క్రికెట్ టోర్నీ

నేడు పోటీలను ప్రారంభించనున్న మాజీ క్రికెటర్ మురళీకార్తీక్

పుట్టపర్తి అర్బన్ : యువతను ప్రోత్సహించడంతో పాటు క్రీడాస్ఫూర్తి పెంపొందించాలన్న లక్ష్యంతో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఈ పోటీలు ఆదివారం నుంచి సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం స్టేడియంలో ఏర్పాట్లను ట్రస్టు సభ్యులు పరిశీలించారు. 2025 నవంబర్‌లో సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఏడాది పాటు ఈ వేడుకలు నిర్వహి స్తున్న నేపథ్యంలో దేశీయంగా ఏడు దశల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువత సత్యసాయి విద్యార్థులతో పాటు సత్యసాయి సేవా సంస్థల్లో సభ్యులై ఉండాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని ఏడాదికి ఒకసారైనా ప్రశాంతి నిలయంలో సేవలో పాల్గొనే వారే అర్హులని తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు ట్రస్టు సభ్యులతో పాటు మాజీ క్రికెటర్ మురళీకార్తీక్ పోటీలను ప్రారంభిస్తారు. పోటీల నిర్వహణకు స్టేడియంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

సోమందేపల్లి : యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెనుకొండలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభం అయ్యింది. ఈ పోటీలను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించారు. యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి లేని బోధన కొనసాగించేందుకు వీలవుతుందన్నారు. ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తున్న యుటిఎఫ్ సేవలు అభినందనీయం అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 13 నుంచి ఆగష్టు చివరి ఆదివారం వరకూ సెలవు దినాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్ నరేష్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి నరేష్, హరికృష్ణ, సీనియర్ నాయకులు నారాయణస్వామి, మహాలింగప్ప, నబి, మారుతి, శేషాద్రి, చెన్నకేశవులు, కృష్ణా నాయక్, ఆదిజినేష్, నరసింహులు, జెవివి నాయకులు హరి పాల్గొన్నారు.

ఆదెప్పను హత్య చేసిన నిందితులను శిక్షిస్తాం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఆదెప్పను హత్య చేసిన వారందరినీ శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. శనివారం సాయంత్రం మెచ్చిరి గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ముక్కుమ్మడిగా తన భర్తను అతికిరాతకంగా తన భర్తను చంపించారని మృతుడి భార్య పార్వతి ఆరోపించారు. హత్యకు పాల్పడిన వారిని శిక్షించాలని, లేకుంటే తమకు అప్పగించాలని కోరింది. గతంలో కూడా తన భర్తపై రెండుసార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారని, మూడోసారి ఒంటరిగా వెళ్తున్న వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని చంపారని వాపోయింది. అనంతరం కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ హనుమంతరాయుని ఆలయానికి సంబంధించిన అర్చకత్వం విషయంలో తన దగ్గరికి వచ్చినప్పుడు పోలీసుల బదిలీలు జరిగేంత వరకూ వేచి ఉండమని చెప్పినప్పటికీ మీరు ఎందుకు మీరు వినలేదని మృతుని బంధువులను ప్రశ్నించారు. రాజకీయ ఎదుగుతున్నాడని ఓర్వలేక ఆదెప్పను వైసిపి గుండాలు హతమార్చారని ఆరోపించారు. సర్పంచితో పాటు 15 మంది చందాలు వేసుకుని హత్య చేయించడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడానని, హత్యకు కుట్ర చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రాజకీయ కుట్రతోనే దారుణంగా హతమార్చారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా కార్యకర్తను చంపితే ఊరికే ఉంటామా.. అని అన్నారు. బాధిత కుటుంబ సభ్యుల మాటలు విన్నాక పోలీసుల మెతక వైఖరి స్పష్టంగా కనబడుతోందన్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, సోమశేఖర్, లచ్చన్న, సిద్ధప్ప, మల్లేషప్ప, పురుషోత్తం, వన్నూరుస్వామి, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మెచ్చిరిలో హత్యకు గురైన టిడిపి కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఆగిన రైల్వే పనులను పూర్తి చేయించాలి

కేంద్ర మంత్రి సోమన్నకు ఎంపీ, ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటక-ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో అర్ధాంతరంగా ఆగిన రైల్వే పనులను వెంటనే పూర్తి చేయడానికి తమ వంతుగా కృషి చేయాలని కేంద్ర రైల్వే, భారీ నీటి పారుదల శాఖల మంత్రి సోమన్నకి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎంపీ బికె.పార్థసారధి కోరారు. మడకశిరకు వచ్చిన కేంద్రమంత్రి సోమన్నకు శనివారం ఎమ్మెల్యే రాజు, ఎంపీ పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ 2006లో ఎంపీ నిజాముద్దీన్ సహకారంతో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాయదుర్గం నుంచి మడకశిర మీదుగా తుమకూరుకు రైల్వే లైన్ మంజూరు చేయించాలని కోరగా కేంద్రం అప్పట్లోనే మంజూరు చేసిందన్నారు. తర్వాత టిడిపి హయంలో చంద్రబాబు సహకారంతో రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయించారన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వం రైల్వే లైన్ పనులను అర్ధాంతరంగా ఆపేసిందన్నారు. కేంద్ర మంత్రి సోమన్న మాట్లాడుతూ మడకశిర కాంగ్రెస్ పార్టీ నాయకులు మడకశిరకు రైల్వే లైన్ మేము తెచ్చామని చెబుతారే కానీ వారు రాయదుర్గం నుంచి తుమకూరు రైల్వే లైన్‌కు కృషి చేయలేదని విమర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి సోమన్న ఎమ్మెల్యే రాజు, ఎంపీ పార్థసారథి, గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థానిక హిందూపురం రోడ్డులో జరుగుతున్న రాయదుర్గం - తుమకూరు రైల్వే లైన్ నిర్మాణ పనులను సందర్శించారు. రైల్వే లైన్ నిర్మాణం జరిగే స్థలంలో ఉన్న గృహ బాధితులకు నష్టపరిహారం ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి సోమన్న, ఎమ్మెల్యే రాజు, తదితరులు

అయోమయంలో వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం పోవడంతో వైసిపి శ్రేణులు అయోమయంలో పడ్డాయి. ప్రధానంగా స్థానిక సంస్థల్లో తాము అధికారంలోనున్న సమయంలో చోటు చేసుకున్న అవినీతి అంశాలను ఇప్పుడు లేవనెత్తి అధికార పక్షానికి ఒక అస్త్రాన్ని అందించే ప్రయత్నం ఈ వారంలో కనిపించింది. ప్రదానంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ, నగర పాలక సంస్థ సమావేశంలోనూ ఇదే కనిపించింది. ఈ రెండు చోట్ల కూడా వారు అధికారంలో ఉన్న సమయంలో అంటే గడిచిన ఏడాదిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ వైసిపి సభ్యులే రెండు చోట్ల లేవనెత్తడం చర్చనీయాంశం అయ్యింది. నిబంధనలకు విదర్ధంగా కొంత మంది నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు బిల్లులు ఇచ్చారంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ లేవనెత్తడం, దానిపై చర్యలు తీసుకోవాలని ఆమె పట్టుబట్టడం ఇప్పటికీ అధికారపార్టీ నేతలకే అంతుబట్టలేదు. ఒకానొక దశలో సహనం కోల్పోయిన టిడిపి నేతలు అధికారంలో ఉన్న సమయంలో మీరు ఏమి చేసారని ప్రశ్నించడం గమనార్హం. ఈ సమావేశంలో ఒక ప్రజాప్రతినిధి తోటకు తాగునీటిని మళ్లించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆరోపించారు. దీన్ని అధికారులు కూడా అంగీకరించి ఇప్పుడు తొలగించామని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అదే సమయంలో నగర పాలక సంస్థలోనూ చెత్త డంపింగ్ యార్డులో అవినీతి జరిగిందని వైసిపి కార్పొరేటర్లతోపాటు డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతిలు పోటీలు పడి ఆరోపించారు. మీ హయంలోనే జరిగింది కదా అన్న ఎమ్మెల్యే ప్రశ్నకు వారిద్దరి సమాధానం లేకుండా పోయింది. ఇలా రెండు చోట్ల కూడా సొంతపార్టీ వారే అవినీతి ఆరోపణలు చేయడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లోకి ఇప్పటి అధికార పార్టీ నేతలుపడ్డారు. మరోవైపు పార్టీ కార్యక్రమాల విషయంలోనూ వైసిపి అయోమయంలోనే పడింది. కొత్తగా నియమితులైన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాత స్థానాల వైపు చూస్తుండగా, కొత్త వారు తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇంకో వైపు జిల్లా అధ్యక్షుల మార్పులు జరగాలని పట్టుబడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా అధికారం కోల్పోతూనే వైసిపి శ్రేణులు అయోమయంలో పడ్డాయి. పార్టీ విధానాలను ఉల్లంఘించారని కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై ఆ పార్టీ వేటు వేసింది. దీనిపై ఆయన ఘాటుగానే స్పందించారు. ఇక అధికారంలోకి వచ్చిన టిడిపి నేతలు ఉత్సహంతో ఉన్నారు. సత్యసాయి జిల్లాలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలు ఆ జిల్లా అభివృద్ధిపై సమీక్షలు నిర్వహించారు. కలసికట్టుగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీల రాజకీయాలు ఇలా జరుగుతున్న సమయంలో ఇప్పటికే సత్యసాయి జిల్లా కలెక్టర్ బదిలీ అయి కొత్తగా చేతన్ బాధ్యతలు చేపట్టారు. తాజాగా రెండు జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యి వారి స్థానంలో కొత్త వారు వచ్చారు. పాలన మారిన తరుణంలో అధికారుల మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యమైన అధికారుల బదిలీ అనంతరం దిగువ స్థాయి అధికారుల్లోనూ మార్పులు జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

ఒప్పంద పత్రం అందుకుంటున్న పివికెకె ప్రతినిధులు

'పివికెకె'కు ఎఐసిటిఇ గ్రాంటు

ప్రజాశక్తి-అనంతపురం

బేసిక్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (పిడిపి) కార్యక్రమాన్ని పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించుకునేందుకు ఎఐసిటిఇ ద్వారా రూ3.5 లక్షల గ్రాంటు మంజూరైనట్లు కళాశాల ఛైర్మన్ డా.పల్లె కిషోర్ తెలిపారు. పివికెకె ఇంజినీరింగ్ కళాశాల పరిశోధన, అభివృద్ధి విభాగం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతిపాదించిన 'ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ' అనే అంశాన్ని పరిశీలించి, దేశానికి ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి ప్రాజెక్టులను మరింత వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంద ఎఐసిటిఇ పరిశోధనను ఆమోదించి, ఎటిఎల్ బేసిక్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించుకునేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కేవలం 350 కళాశాలలకు మాత్రమే ఆమోదం తెలిపిందని, ఇందులో పీవీకేకే ఒకటిగా నిలవడం ఎంతో హర్షణీయమని కళాశాల ఛైర్మన్‌తోపాటు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, తెలిపారు.

ఈ మైలురాయిని సాధించేందుకు కృషి చేసిన ఆర్అండ్‌డి డీన్ కెసి కుళ్లాయప్ప, అటల్ ఎఫ్‌డిపి కన్వీనర్ జి.శ్రీనివాసన్, కో కన్వీనర్ డా.బి.హరిప్రసాద్, ఆనంద్ దంపెళ్ల తదితరులను కళాశాల కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.దీప్తి జోర్దాన తదితరులు అభినందించారు.

ట్రాన్స్‌కో ఉద్యోగి శ్రీనివాసులుకు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అదరపు కార్యదర్శిగా ఎన్నికైన ఎపిఎస పిడిసిఎల్ ఉద్యోగి శ్రీనివాసులను శనివారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీ కూడలిలో ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపు ఎరుగని పోరాటాలు చేసే శ్రీనివాసులు కు రాష్ట్ర స్థాయి పదవులను దక్కాలని మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.శివశంకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు డేనియల్, శ్రీనివాసులు, రవికుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, భాస్కర్, సత్యనారాయణ, ప్రేమ్, రవి, శివకుమార్, సలీం బాషా, కె.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగి శ్రీనివాసులును సన్మానిస్తున్న మార్నింగ్ వాకర్స్

రైతులు వాణిజ్య పంటలను సాగు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

రైతులు లాభదాయకంగా ఉండే వాణిజ్య పంటలను సాగు చేయాలని రేన్యూ సంస్థ ప్రతినిధులు కార్తీక్, పవన్, ఇందుశ్రీ, హర్షిత చావ్లా సూచించారు. శనివారం మండలంలోని కొత్తపేటగ్రామ శివారులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో అగ్రోఫారెస్ట్రీ 2024-25ప్రాజెక్టులో భాగంగా రేన్యూ సే ట్రీస్, కోషర్ సంస్థల ఆధ్వర్యంలో కార్బన్ ప్రాముఖ్యతపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు లాభదాయకంగా ఉండే మామిడి, వేప మొక్కలను పెంచాలన్నారు. ప్రాజెక్టు ద్వారా పండ్ల మొక్కలతో పాటు అడవి చెట్లను రైతులకు ఉచితంగా అందిస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణ రైతులు తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ ట్రీస్ సంస్థ ప్రతినిధులు మహేధర్ రెడ్డి, అనురాగ్, మనోహర్, హెచ్‌మెంద్ర,వీరవలి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ పీడీ ఎం.నారాయణస్వామి, సిబ్బంది, ఐదు మండలాలకు చెందిన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న రేన్యూ సంస్థ ప్రతినిధులు, రైతులు

BEFORE THE KARNATAKA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, BASAVA BHAVAN, BANGALORE: 560 001
Complaint No.139 / 2022

Complainant	Opposite Parties
1. Mr. Balasubramanya S/o, Srikantiah. Aged about 43 years. Residing at Pavans Tranquil Homes, J.P.Naga, 4th Phase, Bengaluru,	1. Mr. M.Anand S/o Late Muniappa, Aged about 71 years, Residing at No.3, 18th Cross, 22nd Main. Opp. Mahaveer woods Apartments, JP Nagara, Bengalure-560078.
2. Smt. Nayana W/o S/o Balasubramanya. Aged about 40 years, Residing at Pavans Tranquil Homes, J.P.Naga, 4th Phase, Bengaluru,	2. Mr.Bharath S/o M.Anand. Aged about 37 years. Residing at No.3, 18th Cross, 22nd Main. Opp. Mahaveer woods Apartments, JP Nagara, Bengalure-560078.
(By Shri/Smt S.K.Prabhakar Shelly)	3. Mr.Nandish S/o M. Anand, Aged about 35 years. Residing at No.3, 18th Cross, 22nd Main. Opp. Mahaveer woods Apartments, JP Nagara, Bengalure-560078.
	4. Smt. Hemavathi Aged about 30 years, Residing at No.3, 18th Cross, 22nd Main, Opp. Mahaveer woods Apartments. JP Nagara.Bengaluru-560078.
	5. Mr.Yogananda Reddy, S/o Setharama Reddy, Aged about 49 years, Residing at No.17/761, Tilak Nagar, Guntakal, Ananthapur District. A.P.
	6. Mr. Chakrapani Reddy S/o Sri G.Chandrasekhara Reddy, Aged about 59 years, Residing at No.17/761, Tilak Nagar, Guntakal, Ananthapur District, A.P.
	7. Manager (Then), Vijaya Bank (Now Bank of Baroda), Domlur Branch(1061), No.208, 5' Cross, Main Domlur, Bangalore-560008.

To.
5.Mr. Yogananda Reddy, Seetharama Reddy, Aged about 49 years, Residing at No.17/761, Tilak Nagar, Guntakal, Ananthapur District, A.P.
6.Mr. Chakrapani Reddy S/o Sri G.Chandrasekhara Reddy, Aged about 59 years, Residing at No.17/761. Tilak Nagar. Guntakal. Ananthapur District, A.P

NOTICE TO THE OPPOSITE PARTIES NO.05 & 06, FOR HEARING OF COMPLAINT IN ENGLISH DAILY NEWS PAPER .PRAJASAKTI"

Whereas the complainant has filed the complaint against Opposite Parties No.05 & 06, under section of the Consumer Protection Act claiming reliefes. You are hereby notified to appear before this Hon'. Commission in person or through a pleader or person authorized as per law to answer all the material quest of facts and law relating to the Complaint on **05th Day of January Two Thousand and Twenty Four (05/01/2024)** at 11.00 AM. Take notice that in case of default of your appearance on the day mentioned above complaint w ill !ward and determined in your absence as per law. Given under the hand and seal of this Commission on this **05th day of December Two Thousand twenty Three (05/12/2023).**

By order of the Commission.
ASST.REGISTRAR CUM ASST.ADMN. OFFICER
K.S.C.D.R.C, BANGALORE: 560001

సెలవు రోజుల్లో తరగతులు నిబంధనలకు విరుద్ధం

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి-ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ సెలవుదినం అయినా తరగతులు నిర్వహిస్తున్న నగరంలోని శ్రీచైతన్య, నారాయణ, వివేకానంద, తదితర కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముందుగా విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రభుత్వ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభ దశలోనే విద్యార్థులపై మానసికంగా, నైతికంగా ఒత్తిడి గురి చేసే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు అయినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛంగా తరగతులు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయం జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకునే ప్రయత్నం చేయలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తున్న డిఇఒ, ఆర్ఐఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐజిల్లా ఉపాధ్యక్షురాలు రజిత, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భీమేష్, శివ, పట్టణ నాయకులు గణేష్, మహేష్, సోము, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భక్తులతో కిక్కిరిసిన గూగూడు

కుళ్లాయిస్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం భారీగా భక్తులు తరలిరావడంతో గూగూడు కిక్కిరిసింది. శనివారం 6వరోజు కావడం.. రెండో శనివారం సెలవుదినం కావడంతో ఒక్కసారిగా స్వామి దర్శనానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. అధికారుల అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో ఇబ్బందులు పడ్డారు. ఓవైపు భక్తుల తోపులాట.. మరోవైపు కుళ్లాయిస్వామి అగ్నిగుండం సెగను పోలీసులు, భక్తులు భరించలేకపోయారు. ముఖ్యంగా స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్ ముందుకు సాగక మహిళలు, చిన్నారులు, వృద్ధులు, తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు.

కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

ట్యాంకర్ నుంచి తాగునీరు అందిస్తున్న అధికారులు

నేడు చిన్న సరిగెత్తు

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చిన్న సరిగెత్తు ఆదివారం నిర్వహించనున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో మరింత మంది భక్తులు తరలిరానున్నారు. చిన్న సరిగెత్తును పురస్కరించుకుని చక్కెర పానకాలను స్వామికి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. ఇందుకోసం భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలిరానున్నారు.

ఉచిత తాగునీటి ట్యాంకులు ఏర్పాటు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎక్కడా నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ రాముడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నార్పల మండల పరిధిలో వెలసిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయాన్ని అనంతపురం మేయర్ మహమ్మద్‌వసీం శనివారం దర్శించుకున్నారు. కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మేయర్ గూగూడుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈయనతోపాటు సైపుల్లా బేగ్, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఖాజా తదితరులు ఉన్నారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న మేయర్ వసీం

డయల్ యువర్ డిఎంకు నాలుగు ఫిర్యాదులు

రాయదుర్గం : రాయదుర్గం ఆర్టీసీ డిపో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో నలుగురు ప్రజలు, ప్రయాణికుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్లు డిపో మేనేజర్ సురేష్ తెలిపారు. బళ్లారి నుంచి రాయదుర్గానికి వచ్చే ఆర్టీసీ బస్సులు బళ్లారి రోడ్డు సంత మైదానం వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం దిగేందుకు ఆపాలని కోరారు. ప్రయాణికుల కోరిక మేరకు బస్సును వారపు సంత మైదానం వద్ద ఆపుతామన్నారు. అలాగే మండల కేంద్రం డి.హీరేహాల్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాయదుర్గం నుంచి డి.హీరేహాల్‌కు రెండు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అంతరాష్ట్ర సర్వీసు కావడం వల్ల ఇప్పట్లో డి.హీరేహాల్ నుంచి బళ్లారికి ప్రత్యేక బస్సు సర్వీసును నడపడం సాధ్యం కాదన్నారు. అలాగే రాయదుర్గం నుంచి సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి బస్సు సర్వీసును నడపాలని ఓ ప్రయాణికుడు కోరారు. ఇప్పట్లో అదనపు బస్సులు లేనందువల్ల ఈ సర్వీసును నడపడం సాధ్యం కాదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని 3వ వార్డు వెంగమనాయుడు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు టిడిపి నాయకులకు విన్నవించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమారుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ కాలనీలో డ్రెయినేజీ కాలువలు లేవన్నారు. అలాగే చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు ఒకదానికొకటి దూరంగా ఉండటం వల్ల విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నాయన్నారు. సీసీ రోడ్లు వేయించాలని విన్నవించారు. ఇందుకు టిడిపి నాయకులు స్పందించి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మా మోహన్, అప్పన్న గారి కుమార్, శ్రీరాములు, సూరి, పురుషోత్తం, రామాంజి, ప్రతాప్, ఎర్రగుడి కిట్ట, లోకేష్, తిమ్మప్ప, చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వివరిస్తున్న వెంగమనాయుడు కాలనీవాసులు

పచ్చిమేతతో అధిక పాల ఉత్పత్తి

పశువైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా

ప్రజాశక్తి-బెలుగుప్ప

పాడి పశువులకు పచ్చి మేత వేయడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని కళ్యాణదుర్గం పశు వైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా సూచించారు. శనివారం మండల కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగాలంటే పచ్చి మేతే ఆధారమన్నారు. అంతేగాకుండా పునరుత్పత్తి సమస్యలు రాకుండా ఉండాలంటే మంచి మేత చాలా ప్రాముఖ్యమన్నారు. 10 పాడి పశువులకు ఎకరాలో సాగు చేసిన గడ్డి అవసరమన్నారు. కావున పాడి పశువుల రైతులు, బోరు సౌకర్యం ఉన్నవారు కచ్చితంగా బహు వార్షిక పశుగ్రాసాలైన రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, హెడ్ లూసర్న్, సుబాబుల్, అవిశామతుల వంటి గడ్డి రకాలను పెంచుకోవాలన్నారు. బోరు సౌకర్యం లేని వారు వర్షాధారిత ఏకవర్షిక జొన్నగడ్డి రకాల పెంచుకున్నట్లయితే ఎండాకాలంలో పశువులకు మేతగా వాడుకోవచ్చన్నారు. మేత వృథా కాకుండా కట్టర్లను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే గొర్రెల కాపరులు అడవి ప్రాంతాల్లో గడ్డి మీదకు, అనుకూలమైన ప్రాంతాల్లో శుబాబుల్ విత్తనాలు, స్టైల్లో విత్తనాలు, అవిసా విత్తనాలు చల్లితే వర్షాకాలంలో చిగురించి మంచి పశు గ్రాసంగా పనికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, కాంపౌండర్ అశోక్, పశువైద్య సిబ్బంది, రైతులు, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిమేతను పరిశీలిస్తున్న పశువైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా

నేడు మెగా వైద్యశిబిరం

రాయదుర్గం : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు 'చేంజ్ ఫర్ సొసైటీ' ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కటారు పశుపతనాథరెడ్డి, మామిడూరు సురేష్ రెడ్డి సహకారంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కళ్లు, గుండె, మూత్రపిండాలు, థైరాయిడ్, మహిళలకు సంబంధించిన సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు చేయించాలనుకునేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నెంబర్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వికలాంగులకు పరికరాలు పంపిణీ



వికలాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న నాయకులు, వైద్యులు

శింగనమల : ఫ్లోరోసిస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఎముకల్లో పట్టుత్వం తగ్గన వారికి శనివారం పరికరాలు పంపిణీ చేశారు. తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా అందించిన లంబార్ బెల్ట్, వాకర్స్, హ్యాండ్ స్టిక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాజు, టిడిపి నాయకులు మారుతీనాయుడు, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, హెల్త్ ప్రొవైడర్ అనూషా, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, ఆశాబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు

మొక్కలను నాటి పరిరక్షించాలి

అనంతపురం : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం నగర శివారులోని ఉప్పరపల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఇందులో భాగంగా వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో దుర్గం బీటు ఫారెస్ట్ ఆఫీసర్ మారెప్ప, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ గిరీష్, ఉప్పరపల్లి పంచాయతీ సెక్రటరీ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

నెలరోజుల్లోనే అభివృద్ధికి పునాది

శింగనమల : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు పెంచిన పింఛన్ల పెంపుతోపాటు అభివృద్ధికి పునాది వేశారని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. అలాగే అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా కార్మికులకు జీవనోపాధి కల్పించారన్నారు. వీటితోపాటు అనేక పథకాలకు కార్యరూపం దాల్చేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటున్నారన్నారు.

గాయపడిన యువకుడికి పరామర్శ

గుత్తి : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని బసినేపల్లి తండా గ్రామంలో దేవేంద్ర నాయక్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ శనివారం పరామర్శించారు. ఇందులో భాగంగా నారాయణ గ్రామంలోని యువకుడు ఇంటికి వెళ్లి పరామర్శించడంతోపాటు వైద్యఖర్చులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం గ్రామంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్ కొనుగోలు కోసం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. గ్రామం అభివృద్ధి కోసం తన అన్న గుమ్మనూరు జయరామ్ తోడ్పాటు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

గుత్తి : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ ఇవ్వాలన్నారు. డిఏ బకాయిలు చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు

నేరాలు ఘోరాలు

మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తమ్ముడు గుమ్మనూరు నారాయణ

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

12 గొర్రెలు మృతి

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై శనివారం గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో 12 గొర్రెలు మృతిచెందాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీపురం గ్రామానికి చెందిన రైతు పాపన్న గొర్రెలు పెంచుతూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే గొర్రెలను మేతకు తొలుకెళ్తూ జాతీయ రహదారి దాటుతుండగా తాడిపత్రి నుంచి బళ్లారికి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ మందపై నుంచి దూసుకెళ్లింది. దీంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో గొర్రె తీవ్రంగా గాయపడింది. గొర్రెల మృతితో రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని రైతు పాపన్న కన్నీరుమున్నీరుగా విలపించాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పాపన్నను ఓదార్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. గొర్రెలపై నుంచి వెళ్లిన లారీని స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరిపై కేసు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో ఉన్న సీఎస్ఐ చర్చి సమీపంలో ఇంటి వద్ద జరిగిన చిన్నపాటి ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హేమావతితో అదే గ్రామానికి చెందిన చిన్న సిద్ధయ్య, భార్య అంజళి గొడవ పడ్డారు. ఈగొడవలో తనను జుట్టు పట్టుకుని కొట్టారని హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసు ఛేదింపు

చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శివ

బెలుగుప్ప : మండల పరిధిలోని అంకంపల్లి గ్రామం సమీపంలో ఉన్న మారెమ్మ ఆలయంలో ఏప్రిల్ 18న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. ఈ చోరీలో రెండు ఇత్తడి గంటలు, రూ.20వేల నగదు అపహరణకు గురైంది. అప్పట్లో మర్ల శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసుకు సంబంధించి శనివారం మధ్యాహ్నం నిందితుడు కళ్యాణదుర్గం మండలం గుండ్లప్పదొడ్డి గ్రామానికి చెందిన ఓబన్నను మండల పరిధిలోని గంగవరం పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి రెండు ఇత్తడి గంటలు, రూ.15వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.